౧

నాటిక

ఒక తల్లి పిల్లలు

కొడవటిగంటి కుటుంబరావు

[అన్నేశ్వరంగారి ఇల్లు - ఒకనాటి ఉదయం]

అన్నే : ఇంకా ఉత్తరాలకోసం వెతుకుతూనే ఉన్నావురా, రాఘవులూ ?

రాఘు : చిన్నమ్మాయి రాసిన ఉత్తరం ఒకటీ దొరకదే.

అన్నే : మిగిలినవో ?

రాఘు : పెద్దబ్బాయి రాసినవి ఎనిమిదున్నై. పెద్దమ్మాయి రాసినవి మూడున్నై. చిన్నబ్బాయి రాసినవి అయిదున్నై. చిన్నమ్మాయి రాసినవే కనబట్టంలేదు.

అన్నే : అదికూడా రెండుసార్లు రాసిందిరా - నాకు బాగా జ్ఞాపకం.

రాఘు : ఈ ఉత్తరాలు ఇన్నిసార్లు కట్టలు విప్పాను, కట్టాను, చిన్నమ్మాయి ఉత్తరం చూసినట్టు నాకెక్కడా జ్ఞాపకంలేదు.

అన్నే : అయితే పోనీ, అది రాసిందని నేను అనుకున్నానేమో. ఒకోక్కసారి మనం అనుకునే విషయాలుకూడా నిజమల్లేనే ఉంటై. కిందటిసారి నాకు జబ్బుచేసినప్పుడూ—

రాఘు : డాక్టరుగారు తొమ్మిదింటికి వస్తామన్నారు గాదూ ? తొమ్మిది కావచ్చింది.

అన్నే : ఏవేవో కొత్త చోట్లు చూశా. కొత్తమనుషులు కనిపించారు. ఆ మనుషులు కనిపిస్తే గుర్తు పట్టగలనన్న మాట.

రాఘు : (నవ్వుతూ) ఇంకాసేపటికల్లా మీ మనవలూ, మనవరాళ్లూ వస్తారు. వాళ్ళను గుర్తుపడితేచాలు.

అన్నే : (గర్వంగా) ఎంత మాటన్నావురా. నా మనవలనూ, మనవరాళ్ళనూ నేనే గుర్తుపట్టలేనుగా. చాల్లే. ఎవరన్నా వింటే నవ్విపోతారు.

రాఘు : వాళ్ళను మీరు చూసి ఎన్నాళ్ళయింది. ఎన్నేళ్ళయింది ?

అన్నే : (ఆలోచిస్తూ) పెద్దబ్బాయి ఉపనయనానికి మేమింకా కలిసే ఉన్నాంగా - వాడికప్పుడు పదమూడో ఏడు-తరవాత ఏణ్ణర్ధానికో ఏమో నా కొడుకు నాతో భాగాలు పడ్డాడు. - వెర్రివాడు. ముప్ఫై ఏళ్ళు. నిన్నగాక మొన్నల్లే ఉంది సుమా—

రాఘు : పెద్దబ్బాయి పెళ్ళిచేసుకున్నాక భార్యతోకూడా మిమ్మల్ని చూడరాలా ?

అన్నే : (ఆలోచన పాడయి) ఏమిటదీ ?

రాఘు : మీరు పెద్దబ్బాయిని చూసి దాదాపు ఇరవయ్యేళ్ళయిందన్నా.

అన్నే : నీ మొహం కాదూ!

రాఘు : సరే, మీ యిష్టం.

అన్నే : (ఆశ్చర్యంతో) వాణ్ణిచూసి ఇరవయ్యేళ్ళయిందిట్రా! చిన్నతనంలో ఎట్లా ఉండేవాడనుకున్నావు? బంగారు నాయన. నా దగ్గర్నుంచి వాళ్ళమ్మదగ్గరికి వెళ్ళేవాడు కాదు. నీకు అమ్మకన్న తాత ఎక్కువట్రా? అనేది పార్వతి... వాడే కాదురా, రాఘువులూ! నలుగురూ నా మీద ఎక్కి తొక్కేవాళ్ళు. సుఖమంటే అదిరా, రాఘువులూ! అన్నిసుఖాలూ మరుపుకొచ్చినా - మనవలూ, మనవరాళ్ళూ మీద ఎక్కి తొక్కిన సుఖం మరుపురాదు. నీ కూతురి కడుపున నలుసులు పుట్టుకొస్తే నీకే తెలుస్తుంది.

రాఘు : అదంతా నిజమే. ఆ నలుసులు అట్లాగే ఉండిపోరుగా! వాళ్లు పెరిగి కోరలూ, గోళ్ళూ పెంచుకుంటారు. వాటితో మనని బరుకుతారు; రక్కుతారు; పీకుతారు; రక్తం కళ్ళజూస్తారు. నాకు మనవలు పుడితే కవచం తొడుక్కు తిరుగుతాను.

అన్నే : నీ మొహం. అనుభవంలేక అంటున్నావు. నువు నా మూడో మనవడివి కాదుట్రా? నీ చిన్నతనం చూడలేదని నాకు ఎంతో బాధగా ఉంటుందిరా, రాఘువులూ.

రాఘు : నా చిన్నతనమా?

అన్నే : అవున్రా. చిన్నప్పుడు నువు చేసిన పనులు జ్ఞాపకం ఉంటే చెప్పు.

రాఘు : ఒకసారి ఉండేలు బద్దతో కుండకు చిల్లిపొడిచా. మా నాన్న కొడవలితో నా నెత్తిన చిల్లి పొడిచాడు. అది మానటానికి అర్నెల్లు పట్టింది.

అన్నే : ఛీ, ఛీ, ఏం మనిషిరా మీ నాన్న?

రాఘు : మా నాన్న మంచి మనిషే. నేనే శనిగాణ్ణి. చిన్నతనంలో నా అంత శనిగాడు. ఇంకొకడుంటాడనుకోను. ఒక్కమంచిపనిచేసినట్టు జ్ఞాపకంలేదు.

అన్నే : (గంభీరంగా) రాఘువులూ, నిన్ను గురించి నువు అట్లా మాట్లాడితే నే నూరుకోను, తెలిసిందా. నీ వంటి బుద్ధిమంతుడు నూటికీ కోటికీ ఒకడుండడు. మీ నాన్న నా కొడుకల్లేనే కర్కోటకుడై ఉండాలి; చిన్నతనంలో నీలో ఉన్న మంచితనం కూడా నీకు జ్ఞాపకం రాకుండా చేసేశాడు. నా మనవలూ, మనవరాళ్ళూ చిన్నతనంలో ఎంత మొద్దుపనాలు చేసేవాళ్ళో వాళ్ళకు చెప్పినవాళ్ళు లేరు. నాకూ వాళ్ళకూ మధ్య నా కొడుకు అడ్డం వచ్చి, వాళ్ళను వేరు చేశాడు. లేకపోతే వాళ్ళ జీవితాలు ఇంత భ్రష్టయి వుండవు. వాళ్ళ చిన్నతనంలో చేసిన ప్రతిపనీ నాకు జ్ఞాపకం ఉందిరా, రాఘువులూ. ఒకసారి ఏం జరిగిందంటే —

రాఘు : మరి మీ అబ్బాయి అట్లా ఎందుకయినాడూ? ఆయన్ని మీరు పెంచలా?

అన్నే : నేను పెంచితే వాడు అట్లా అవుతాడుట్రా? వాణ్ణి వాళ్ళమ్మ పెంచింది. పెంచటంలో కూడా ఎట్లా? విషంపోసి పెంచిందనుకో - విషం. అసలు వాడు నూటికి తొంభై తొమ్మిదిపాళ్ళు తల్లి పోలిక. దాని

ముక్కు నుంచి ఊడిపడ్డాడు. ఎక్కడ ఉన్నా నా పోలిక అంటూ ఉంటే అదిమాసి వాడు సిగ్గుపడేట్టు తయారు చేసింది. వాడూ తల్లి కొడుకుగా పెరిగాడు.

రాఘు : అందరూ తల్లి కొడుకులుగానే పెరుగుతారు.

అన్నే : అందరూ తండ్రి అంటే అసహ్యించుకుంటారుట్రా. వెర్రి వాడా? మొదటినుంచికూడా నా కొడుకు నమ్మకమేమిటంటే, నాకు ప్రపంచ జ్ఞానం లేదనీ, నేను అసమర్థుణ్ణనీ, నన్ను గురించి సిగ్గుపడాలనీ, నా సలహా ప్రకారం చేస్తే తాను బాగు పడననీ. వాడి తల్లికికూడా నన్ను గురించి అటువంటి ఉద్దేశమేలే.

రాఘు : అటువంటి అపోహాలు ఎంతో కాలం ఉండవే.

అన్నే : మా వాడికి నన్ను గురించి యెప్పుడు అభిప్రాయం మారిందో నాకు తెలీదు. నాతో భాగాలు పడేనాటికి పోలేదు. వాడి భాగం వాడు పంచినాక నేను లక్ష రూపాయలు సంపాదిస్తానని వాడు ఊహించి ఉండడు. అది చూశాక వాడి ఉద్దేశం మారిందేమో మరి. నేను డబ్బు సంపాదించే కాలంలోనే వాడు తన ఆస్తి యావత్తూ క్షవరం చేసేసుకున్నాడు. లక్షాధికారి కొడుకు బికారిగా చచ్చిపోయాడు.

రాఘు : పోనివ్వండి, మీ డబ్బు మీ అబ్బాయికి పనికిరాకపోతే ఆయన పిల్లలకైనా ఉపయోగపడుతున్నది.

అన్నే : ఉపయోగపడుతున్నదా? అదే నా అనుమానం. వాళ్ళు సుఖపడుతున్నారా? ఒక తల్లి పిల్లలమధ్య ఉండదగిన ఆప్యాయత వాళ్ళమధ్య ఉన్నదా? లేదు, రాఘవులూ వాళ్ళ తండ్రి వాళ్ళమధ్య గోడలుకట్టి మరీ వెళ్ళాడు. ఆ నలుగురినీ వచ్చి నా దగ్గిర ఒక ఏడాది ఉండమన్నాను. వాళ్ళు రారు. నలుగురూ ఒక చూరు కింద నిలబడరు—జడివాన కురుస్తున్నా సరే. అందుకే చివరకు – (కారు హారన్) డాక్టర్లే ఉంది. వెళ్ళి తీసుకురా.

రాఘు : (పక్కనున్న హాలులో నుంచి) రండి, డాక్టరుగారూ, తాతగారు మీ కోసమే ఎదురు చూస్తున్నారు.

డా : ఆయనకు ఒంట్లో సరిగాలేదా ఏం?

రాఘు : బాగానే ఉన్నారండి. మిమ్మల్ని పిలిచింది—

డా : హలో (ఈలోపుగా అన్నేశ్వరం ఉన్న గదిలోకి వచ్చేసి) హలో, తాతగారూ, బాగానే ఉన్నారే. తప్పకుండా రమ్మన్నారనే సరికి ఏం ముంచుకొచ్చిందో అనుకున్నాను.

అన్నే : విశేషం ఉండే రమ్మన్నానయ్యా, డాక్టరూ! ఇవాళ నా మనవలూ, మనవరాళ్ళూ నన్ను చూడటానికి వస్తున్నారు. వాళ్ళు నన్ను చూసి, నా దగ్గరికి వచ్చి చాలా ఏళ్ళయింది. విశేషం కాదూ మరి?

డా : ఏది విశేషమో నా కర్థం కాలేదు- వాళ్ళు ఇన్నాళ్ళూ మీ దగ్గరికి రాకపోవటమా, ఇప్పుడు రావటమా?

అన్నే : రెండూనూ.

డా : అందుకని పార్టీ ఏమైనా ఇస్తున్నారా ఏమిటి? నాకీమధ్య పార్టీ తగిలి చాలాకాలమయింది.

అన్నే : వాళ్ళు వచ్చేసరికి ఇక్కడ డాక్టరొకడు ఉండటం అవసరం. అందుకని నీకు కబురుచేశా. అందుకే మిగిలిన కేసులు చూసుకుని మరీ రమ్మన్నా.

డా : మీ మనుమలూ, మనవరాళ్ళూ జబ్బులతోగాని బాధపడటం లేదుగద.

అన్నే : వాళ్ళకు అంతో ఇంతో జబ్బున్నమాటా నిజమే మరి. అయితే అది నీ ఇంజెక్షన్లకు లొంగే జబ్బు కాదు.

డా : ఇవాళ అన్నేశ్వరంగారు మంచి ఫారంలో ఉన్నట్టున్నారు. నే నిక వేళాకోళం కట్టిపెట్టి, అంపశయ్య మీద ఉన్న భీష్ముణ్ణి ధర్మరాజు అడిగినట్టు వినయ విధేయతలతో అడుగుతాను. ఏమిటీ విశేషం?

అన్నే : (నవ్వి) మొత్తానికి నాటకాలాడ వలసిన వాడివి. దారి తప్పి వైద్యంలో పడ్డావు. బోనులో పులి లాగా ఎందుకల్లా పచార్లు చేస్తావు? కూచో, విషయం చెబుతా... ఈ వచ్చేవాళ్లు నా కొడుకు పిల్లలు, వీళ్ళెందుకు వస్తున్నారో తెలుసా? నా స్థితి చాలా ప్రమాదకరంగా ఉందని రాఘవులుచేత టెలిగ్రాము లిప్పించాను. రిప్లయి టెలిగ్రాములు. నా పెద్ద మనవడు తప్ప మిగిలిన ముగ్గురూ జవాబులిచ్చారు. వాళ్ళు వచ్చే వేళ అయింది. రాఘవులూ, నువు హాలులో ఉండి వాళ్ళను అక్కడే కూచోబెట్టు. నేను చెప్పిన దాకా ఎవ్వరినీ ఈ గదిలోకి రానియ్యొద్దు.

రాఘు : నాకు తెలీదా? (పోతాడు)

డా : తాతగారూ, మీ కిప్పుడు ఎన్నో ఏడూ?

అన్నే : ఎనభై ఆరో ఏడు నాయనా.

డా : ఎలాంటి శరీరతత్వమండీ మీదీ! చత్వారంలేదు, చెవుడు లేదు, దంతాలు కూడా ఊడలేదనుకుంటా

అన్నే : చత్వారం వచ్చి పోయిందిగా. చెవుడే రాలేదు, నీ దయవల్ల.

డా : మీవాళ్లువస్తే వాళ్ళను ఆహాలులో కూచోబెడతారా? తరవాత ఏం చేద్దామని మీ ఉద్దేశం?

అన్నే : చూడు, బాబూ ఈ పిల్లలు నాకు చంటిపిల్ల లంటివాళ్ళు. నీకు తెలీనిదేముంది? చంటిపిల్లలను మనం దేవుళ్ళల్లే చూడాలి. వాళ్ళపట్ల మనం దేవుడల్లే ప్రవర్తించాలి. అవునంటావా?

డా : అది సాధ్యమవుతుందిటండీ.

అన్నే : సాధ్యమైనంతవరకే అనుకో - అయిందా, నేను డబ్బు సంపాదించా. రెండు తరాలపాటు హాయిగా కూచుని అనుభవించవచ్చు. నా కొడుకు భీష్మించుకూర్చుని నా డబ్బు ముట్టుకోలేదు. నా డబ్బంతా నా కొడుకు పిల్లలకే ఇచ్చేశా. కాని వాళ్ళు సుఖపడలేదు. ఇవాళకూడా వాళ్ళు కష్టాలలోనే ఉన్నారు. వాళ్ల కష్టాలు డబ్బుతో తీరేవే అయినా కూడా నాదగ్గిర ఇక డబ్బులేదు. చెప్పుకోదగినంతలేదు.

డా : వాళ్ళ కష్టాలు ఎలాంటివి?

అన్నే : ఉన్నది నలుగురు. ఒక గర్భవానాన పుట్టినవాళ్ళు. అయినా ఒకరి పొడ ఒకరికి గిట్టదు.

డా : గర్భశత్రుత్వం.

అన్నే: తమకు తామే శత్రువులైనవాళ్లు ఎప్పుడూ లోకానికి శత్రువులుగానే ఉంటారు.

డా: 'నీ భీకర శత్రులార్వర ప్రభిన్నుల జేసిన ప్రాణికోటిలో నీకు విరోధి లేడు...'అన్నట్టుగానా!

అన్నే: వాళ్ళను బాధించేది అరిషడ్వర్గం కాదులే. వాళ్ళు తమలో ఉండే మంచితనాన్ని పూర్తిగా మరిచిపోయినారు. అది ఆత్మద్రోహం. అంతకన్న పాపం మరొకటి లేదు.

డా: మీరేదో కొత్త వేదాంతం కనిపెట్టినట్టున్నారు. అది నాకు సరిగా అర్థం కావటంలేదు.

అన్నే: ఇందులో పెద్ద వేదాంత మేముందోయ్? ప్రతి మనిషికీ చిన్నతనంలో సమస్త సద్గుణాలూ ఉంటై. ఇంకోరి ఆనందాన్ని పంచుకోవటమూ, ఇంకోరికి సహాయం చెయ్యటమూ చిన్నపిల్లల్లోకూడా ఉంటుంది. అయితే పెద్దయినకొద్దీ ఈ గుణాలు తరిగిపోతై. జీవితం అటువంటిది, దానికేం చేస్తాం? కాని, నేననేదేమంటే, మనకు స్వభావంగా ఉన్న మంచితనాన్ని బొత్తిగా పోగొట్టుకోటం అపచార మంటాను. చాతనైతే దాన్ని పెంచుకోవాలి, లేకపోతే ఉన్నదైనా దక్కించుకోవాలి. అదికాస్తా పోయినాక యిక జీవితానికి అర్థమేమున్నదీ?

డా: ఏమోనండీ, తాతగారూ. నన్నడిగితే పదిరాళ్లు సంపాదించి వెనకవేసుకున్నవాడు ప్రయోజకుడు. నావాళ్ళు, నావాళ్ళు అని పాకులాడినవాడు చివరకు ఫూలవుతాడు. ఈ ప్రపంచంలో ఎవరి కెవరు?

అన్నే: దీపాలను నమ్ముకోవటంకన్న చీకట్లో తడుముకోవటమే సరిఅయిన జీవితాదర్శ మంటావా?

డా: ఎక్కడున్నాయండీ ఆ దీపాలూ?

అన్నే: వెర్రివాడా, నువ్వొక దీపానివి కావూ? నేనొక దీపాన్ని కానూ? అద్దాలకు పట్టినమసి తుడిచేసుకోవాలే గానీ... ఇంతకూ అసలు సంగతి మనం మాట్లాడనేలేదు. మావాళ్ళు వస్తారు. నాకు ప్రాణంమీదికి వచ్చినట్టు వాళ్ళతో చెప్పాలి. ఎట్లాగైనా వాళ్ళు నలుగురూ ఏకం కావటం నాకు ముఖ్యం. ఆ తరవాత నేను హాయిగా కన్నుమూస్తాను. అందుకనీ—

రాజ్యం: (హాలులోకి వచ్చి, రాఘవులుతో) అన్నేశ్వరం గారిల్లు ఇదేనన్నారు.

రాఘు: అవును. మీ పేరు?

రాజ్యం: రాజ్యలక్ష్మి, అన్నేశ్వరంగారి చిన్న మనవరాలిని. మా తాత కెట్లా ఉందో?

రాఘు: స్పృహలేదు. డాక్టరుగారు అయిదు నిమిషాల కొక ఇంజెక్షనిస్తున్నారు.

రాజ్యం: ఆయన్నొకసారి చూస్తా.

రాఘు: వీల్లేదు, వీల్లేదు, కాస్సేపట్లో డాక్టరుగారు బయటికొస్తారు. ఆయన అనుమతి తీసుకుని —

డా: (రహస్యంగా) ఆ వచ్చినది మీ మనవరాలా?

అన్నే: (రహస్యంగా) అవును. దాన్ని నేను కిందటిసారి చూసినప్పుడు

పన్నెండేళ్ళపిల్ల. ఇప్పుడు పాతికేళ్లుంటయ్యేమో.

డా : (రహస్యంగా) వీళ్ళని మీరు చూసి ఎన్నో ఏళ్ళయిందంటున్నారే. వాళ్ళ అంతరాత్మల్లో ఉండే విషయాలు మీకెలా తెలుసునా?

అశ్నే : ఇవిగో వాళ్ళ ఉత్తరాలూ... ఇప్పుడు మనం చెయ్యవలసిందేమిటంటే - (ఇంకా రహస్యంగా మాట్లాడుతాడు) ...

రాజ్యం : నేనొక్కర్తెనేనా వచ్చింది?

రాఘు : డాక్టరుగారొచ్చారుగా?

రాజ్యం : (చిరాకుగా) ఇడియట్! మా అక్కయ్యగాని, అన్నయ్యలుగాని రాలేదా అని అడిగాను.

రాఘు : వస్తే కనిపించరూ?

రాజ్యం : నీకు మర్యాదగా మాట్లాడటం కూడా చాతకాదా? ఎవరు నువ్వు? మా తాత నౌకరువేనా?

రాఘు : సగం నౌకరునూ, సగం మనవణ్ణి.

రాజ్యం : అంటే?

రాఘు : అసలు మనవలు తాతగారికి సేవ చెయ్యకుండానే ఆయన సొత్తు తినేస్తే నేను ఆయనకు సేవ చేస్తూ తినేశాను. సొత్తు తినకుండా ఉంటే అచ్చగా నౌకర్నయేవాణ్ణి. సేవ చెయ్యకుండా ఉంటే అచ్చగా మనవణ్ణయేవాణ్ణి.

రాజ్యం : తెలివి చాలాదాకా ఉందే. అవతల తాతయ్య ప్రాణం అటో యిటో అన్నట్టుంటే నీకు చీమ కుట్టినట్టయినా లేదులాగుందే?

రాఘు : మీ కళ్ళు ఏ ఇనప్పెట్టెమీద ఉన్నయ్యో, నావీ దానిమీదే. అయితే నాకు ముందే తెలుసు - ఆ ఇనప్పెట్టె ఏనాడో ఖాళీ అయింది. కుట్టటానికి చిన్న చీమకూడా లేదు అందులో.

రాజ్యం : అందరూ నీలాగే డబ్బు మనుషులనుకున్నావా?

రాఘు : కొందరు తాతగారితో పాటు ప్రాణాలు కూడా వదలచ్చు. నే నెందుకు కాదంటానూ?

రాజ్యం : నాకలాంటి ఇచ్చకాలు చాత కావు. పొయ్యేవాళ్ల వెంట ఎవరూ పోరు.

రాఘు : పొయ్యే వాళ్ల వెంట పోరు, ఉండేవాళ్ళ వెంట ఉండరు. నీ బోటి వాళ్ళు ఏంచేస్తారు, తల్లీ? తొంభై ఏళ్ళ తొక్కు, దిక్కులేని బతుకు బతికి దిక్కులేని చావు చావనా? మీరంతా ఉండి ఆయనకు ఏం ఒరిగించినట్టు?

రాజ్యం : బాగుందే. నా బతుకు నేను బతుకుతున్నాను. దిక్కులేకుండా పోవటానికి తొంభైఏళ్ళ తొక్కే కావాలా? నాదీ దిక్కులేని బతుకే. తాతయ్యకు తవ్వుకు పోయినంత డబ్బున్నా ఉంది, నాకు చిల్లిగవ్వ లేదు.

రాఘు : అవసరం వచ్చినప్పుడు తాతగారికి రాసి డబ్బు తెప్పించుకోలా? డబ్బు పనికొచ్చిందిగాని, మనిషి పనికి రాలేదు గామాలు.

రాజ్యం : ఆ డబ్బు తీసుకున్నందుకే నీ బాబుగాడి సొమ్మంతా పోయినట్టు దెప్పుతున్నావే. వచ్చి ఇక్కడ తిష్ట వేస్తే ఇంకా ఏమనేవాడివో.

(పురుషోత్తం వస్తాడు)

రాఘు: ఓ హో, పెద్దబ్బాయిగారా, సరిగా సమయానికి వచ్చారు. కూచోండి.

పురు: ఏం రాఘువులూ, బాగున్నావా? ఏమిటి విశేషం? (రాజ్యాన్ని చూసి) ఓ, నువ్వా?

రాజ్యం: అవును, నేనే. ఏం? కాకూడదా?

రాఘు: ఊరుకోండమ్మా, తగాదాలాడటానికి తరువాతబోలెడంత సమయం- ఆ ముసలాయన హరీ అన్నాక.

పురు: (ఆశ్చర్యంతో) ఏమిటీ! తాతయ్య ఇంకా బతికున్నాడా?

రాజ్యం: (వెటకారంగా) ఎంత పొరపాటయిందీ. ఈ సంగతి తెలిస్తే ఇంకో నాలుగైదు వేలు అవసరానికిపట్టుకుపోయే వాడివిగద.

పురు: నీమాదిరిగా ఆడజన్మ ఎత్తివుంటే డబ్బుగలవాళ్ళను ఇట్టే ఆకర్షించి —

రాఘు: (అడ్డుపడి) డాక్టరుగారు నన్ను పిలుస్తున్నట్టుంది. ఇప్పుడే వస్తా. (వెళతాడు)

రాజ్యం: నన్నేమీ ఎత్తిపొడవక్కర్లేదు. ప్రేమంటూ ఒకటి ఉందని కూడా నీకు తెలీదు, తెలిస్తే అవాకులూ, చెవాకులూ మాట్లాడవు.

పురు: నాచేత మాటలు పడటం ఇష్టంలేని దానివి నన్ననకు. ఇన్ని బొప్పెలు కట్టినా నీకింకా చిన్నప్పటిగుణం మారలేదు. నువు అందరిమీదా నోరు పారేసుకోవచ్చుగాని, నీపైన ఈగ వాలరాదు.

రాజ్యం: నామీదకు ఈగల్ని తోలే అధికారం నీకు లేదు. ఎవరంటే పడాలో, ఎవరంటే తిరగబడాలో నాకు బాగానే తెలుసు. బొప్పెలు కట్టింది నాకుకాదు, నీకు. నీ చరిత్రంతా నాకు తెలియటం లేదనుకోకు, అంతా తెలుసు.

పురు: (ఆవేశంతో) ఆపే వదరకు. నన్ను గురించి నీకు ఏనాడూ అవగింజంత కూడా తెలియదు. నీ చరిత్ర ఏమిటో నేను మాత్రం ఎరగను - నాకక్కర్లేదు కూడాను.

(ఇద్దరూ బిగుసుకుపోతారు)

అన్నే: (రహస్యంగా) వింటున్నావా, డాక్టరూ? నా పెద్ద మనవడూ, చిన్న మనవరాలూనూ. రాఘువులూ నువు అక్కడే ఉండు. చప్పున వాళ్ళు లోపలికి రాగలరు.

రాఘు: (రహస్యంగా) ఏం మాటలు వినాలిసొస్తుందో అని పారిపోయి వచ్చా.

అన్నే: (రహస్యంగా) నువు లేకపోతే ఇంకా విజృంభిస్తారు.

రాఘు: (రహస్యంగా) వెళుతున్నా.

పురు: ఏం, రాఘువులూ? తాతయ్య ఏ స్థితిలో ఉన్నారు?

రాఘు: ఇంకా స్పృహ రాలేదు. డాక్టరుగారు అక్కడే వున్నారు.

పురు: ఇంకా చెప్పవేం? ఒకసారి ఆయన్ను చూస్తా.

రాఘు: వద్దు, వద్దు. ఎవరినీ లోపలికి రానివ్వద్దని డాక్టరుగారు ఖచ్చితంగా చెప్పారు.

పురు: నాకు తాతయ్యమాటే జ్ఞాపకం లేదు. ఈపూట వేరే పనిమీద వచ్చి, ఈ ఇంట్లో ఎవరుంటున్నారో అని తొంగిచూశానన్నమాట. రైలు కింకా గంట టైమున్నది. అందుకని -

రాఘు : తాతయ్యగారు మీకూడా టెలిగ్రాం ఇచ్చారు. రిప్లయి టెలిగ్రాం. సమాధానం రాలేదు. మిగిలిన ముగ్గురూ సమాధానా లిచ్చారు.

పురు : ఏమిటీ ? శకుంతలా, సత్యమూ కూడా వస్తున్నారా ఏమిటి ?

రాఘు : అవును పెద్దబ్బాయిగారూ.

పురు : అపూర్వ సమ్మేళనం. 'ఓగులెల్ల కూడి రొక్కచోట' అన్నట్టుగా.

రాజ్యం : నువుకూడా ఓగుల్లో ఉన్నావు కద.

పురు : నిన్ను ఒక్కత్తైనే అనటంలో నాకేమీ ఆనందంలేదు.

శకుం : (లోపలికి వస్తూ) అందరూ వచ్చినట్టున్నారే ?

రాఘు . పెద్దమ్మాయిగారు కాదూ ? దయచెయ్యండమ్మా. ఇలాకూచోండి. తాతయ్యగారికి స్పృహలేదు. డాక్టరు గారు మత్తుమందిచ్చారు.

శకుం : కళేబరం కోసం చేరిన గద్దల మన్నమాట. హుఁ, ఆయనకేం ? ఆయన దేవుడే. ఆయన చేసిన ద్రోహ మల్లా మావంటి మనవరాళ్ళనూ మనవలనూ కనటమే.

రాజ్యం : (కోపంగా) నిన్ను కావలిస్తే అనుకో. మమ్మల్ని అనటానికి నువ్వెవరవు ? నేను తాతయ్య కీర్తి ప్రతిష్ట లకు ఎటువంటి కళంకమూ తీసుకు రాలేదు.

పురు : అవును. నువు ఇన్నాళ్ళూ కాపురం చేస్తున్నది కట్టుకున్న మొగుడితోనే అని ఆయన అనుకుంటున్నారు.

శకుం : నీకేమన్నా పిచ్చి పట్టిందా ఏమిటి ? కట్టుకున్న మొగుణ్ణి నమ్ముకునే సాబోటివాళ్ళంటే దానికి నామోషి.

రాజ్యం : నీ కూతురు...

శకుం : నువు తెగబడితే ఏం చేశాం ? నాకూతురూ అంతే. లేదా ఏమంటే నాకూతురు నేను చచ్చానా బతికానా అని అప్పుడప్పుడూ కనుక్కుంటుంది. పస్తులు పడుతున్నామని వింటే భోరుమని ఏడుస్తుంది. దగ్గర ఉంటే డబ్బు పంపిస్తుంది.

రాజ్యం : నేనుకూడా నీకు డబ్బు పంపిస్తే నా అంత పతివ్రత లేదని ఒప్పుకునేదానివే.

శకుం : ఒకరి పాతివ్రత్యం నాకెందుకే, పిచ్చిదానా ? నాకష్టసుఖాలు పంచుకున్నవాళ్ళు నాకు అయినవాళ్ళు. మంచి చెడ్డలు చూడటానికి దేవుడు లేడూ ?

రాజ్యం : మంచిచెడ్డలు చూడటానికి దేవుడున్నాడో లేడో కాని, డబ్బు అడిగినప్పుడల్లా పంపటానికి తాతయ్య ఉన్నాడు.

శకుం : తవుడు తింటూ ఒయ్యారం దేనికి? తాతయ్య డబ్బు నేనొక్కత్తైనే తిన్నానా ? అందరూ తిన్నాం.

రాజ్యం : మేమందరమూ అయిన దానికీ కాని దానికీ దేవుడి పేరెత్తటం లేదు.

పురు : (గట్టిగా) మీరిద్దరూ కాస్సేపు నోరుమూస్తారా ? దిక్కుమాలిన సజ్జు. అందరూ విని ఏమనుకుంటారో అని సిగ్గన్నా లేదు.

రాజ్యం : (వెటకారంగా) చెప్పొచ్చాడు సజ్జనుడు. నువు చేసిన వెకిలి పనులన్నీ చాలా రహస్యంగా చేశాననుకుంటున్నావు గామాలు. పాలు

తాగే పిల్లి. ఉష్ట్రపక్షి. చేసే చేసే కాపురం చెడగొట్టినవాడివి. చేసుకునే ఉద్యోగంలోనుంచి వెళ్ళగొట్టించుకున్నవాడివి. నువ్వు మాకు నీతులు చెప్పటమేమిటి?

పురు: పొగరు తలకెక్కి నీకు విచక్షణా జ్ఞానం కూడా లేకపోయింది. నేను ఎవరి కాపురం చెడగొట్టాను? దేవకి దేనా? నేనా రాత్రి లేవదీసుకుపోకపోతే పర్నాడు జనానికి దేవకి శవమే కనబడేది. ఆ దౌర్భాగ్యురాలు విషం తెచ్చుకుని దాచిపెట్టుకున్నది. నేనొక ప్రాణాన్ని కాపాడాను. నువ్వో, ఒక ప్రాణం తీసినవాడివి. నీ మూలంగా ఆ నాయుడి పెళ్ళాం ఆత్మహత్య చేసుకున్నది. అంతపని జరిగినాక మరొకరయితే కుక్కిన పేనులాగా అణగిమణగి జీవితం వెళ్ళబుచ్చేవాళ్ళు. నువ్వు మటుకు మనిషి రక్తం మరిగిన పులి లాగా -

ప్రసా: (వస్తూ) ఓ హలో, హలో, హలో, ఫుల్ హౌస్. మై డియరెస్ట్ బ్రదర్, మై వెరీ డియరెస్ట్ సిస్టర్స్. మీరంతా ఇంకా బతికి బాగుండటం చూచి ఈ దీనుడు దిగ్భ్రాంతుడై పోతున్నాడు.

పురు: నాల్లే, చొక్కబారు నాటకాల్లో లాగా మాట్లాడకు.

ప్రసా: చొక్కబారా. ఇందులో చొక్కబారు ఏమీలేదే. నాకీ ప్రపంచంలో మీ ముగ్గురి మొహాలు చూడటమంత రోత మరొకటిలేదు.

పురు: అందులో నీ ప్రత్యేకత ఏదో ఏడిచిందనుకుంటున్నావేమో. అటువంటిదేమీలేదు. ఈ విషయంలో అందరూ నీలాంటి వాళ్ళమే. కాని నీలాగా మేం డప్పేసి చెప్పుకోం. కాస్త నిగ్రహించుకో.

రాజ్యం: నిగ్రహించుకోవటం ఇంటా వంటా లేదు. తనకు ఏ క్షణం ఎవరి మీద మోజుపుట్టినా మరుక్షణం ఆ సంగతి లోకానికంతా చాటాలి. లేకపోతే నిద్రపోలేదు.

ప్రసా: నీలాగా నేను సిగ్గుమాలిన వాళ్ళను ప్రేమించను. ఎవరిని ప్రేమించినా ఘరానాగానే ప్రేమిస్తాను. అందులో సిగ్గుపడవలసిందేమీ లేదు.

రాజ్యం: కాని డప్పు కొట్టవలసింది చాలా ఉంటుంది.

ప్రసా: అది నా ఆత్మవిశ్వాసానికి సంబంధించిన విషయం.

పురు: నీ ఆత్మవిశ్వాసమే అసలు జరిగేట్టయితే నీ చరిత్ర ఆంధ్రదేశపు చరిత్ర అవుతుంది. తగ్గు తగ్గు.

ప్రసా: ఆంధ్రదేశంలో ఉన్న అపూర్వ స్త్రీలు నన్ను ప్రేమించితే అదికూడా నా తప్పే?

శకుం: ఆ అపూర్వ స్త్రీలను కొందరిని మేం చూశాంలేరా బాబూ.

రాజ్యం: ఇంకా రెండురోజులు పోనీ నీ మీద పేడనీళ్ళు చల్లిని మనిషల్లా అపూర్వస్త్రీ అవుతుంది.

ప్రసా: నా తోబుట్టువులు నన్ను చూసి ఇలా అసూయతో ఉడికిపోవటం చూసి నేను చాలా గర్వించవలసి వస్తోంది. మీరు మరికాస్త ఉడుక్కోగలందులకు చెబుతున్నాను. మన పేరు త్వరలోనే వెండి తెరపైకెక్కబోతోంది.

రాజ్యం: మహాప్రసాదం అని ఎవరో సినిమా తీయబోతున్నారుట. నేనూ విన్నాను

పురు: హియర్, హియర్!

ప్రసా: మీ అల్పబుద్ధిచూస్తే నాకు నవ్వాలో ఏడవాలో కూడా తెలియకుండా ఉంది —

రాజ్యం: ఏడుస్తూనే ఉంటివిగా?

ప్రసా: నేను పిక్చరు తియ్యబోతున్నాను. స్క్రిప్ట్ రెడీ, స్టార్స్ రెడీ, అంతా రెడీ —

రాజ్యం: తాతయ్య ఒక లక్ష రూపాయలివ్వటమే తరవాయి. అయితే చిక్కేమిటంటే తాతయ్య దగ్గిర డబ్బులేనట్టు కనబడుతుంది; ఈ పేక ముక్కల మేడ కూలిపోవటం చూడందే నేనిక్కణ్ణుంచి పోను.

ప్రసా: నాన్సెన్స్, తాతయ్య దగ్గిర డబ్బు అయిపోవటమేమిటి? అట్లా ఎన్నటికీ జరగదు. అయినా నేనిప్పుడే తాతయ్యను అడిగేస్తాను.

రాఘు: తాతయ్యగారికి స్మారకం లేదు బాబూ. డాక్టరుగారు ఇంజెక్షనిచ్చి నిద్ర పుచ్చారు. అదుగో డాక్టరుగారే వస్తున్నారు.

పురు: ఏమండీ, డాక్టరుగారూ? తాతయ్య ఎలా ఉన్నాడు? ఏమిటి జబ్బు?

డా: ముసలితనం తప్ప ఆయనకు వేరే జబ్బేమీ లేదు.

ప్రసా: అయితే ఆయనింకా చాలా కాలం బతుకుతాడు.

డా: నేనా మాట అనలేను. కొమ్మన పండిన పండు ఏ క్షణాన ఏ కారణంగా రాలిపోతుందో ఎవరూ చెప్పలేరు. మామూలు రోగి అయితే ప్రాణాపాయం ఏపాటి వున్నదీ నేను సులువుగానే చెప్పగలను. కాని అన్నేశ్వరంగార్ని విషయంలో ఏమీ చెప్పటానికి వీల్లేదు. మీరు నలుగురూ ఆయన కొడుకు సంతానం అనుకుంటాను?

పురు: అవునండీ. నేను పెద్దవాణ్ణి. నా పేరు పురుషోత్తం. నా తరవాతది శకుంతల. తరవాతవాడు వీడూ - ప్రసాద్. ఆఖరుది రాజ్యలక్ష్మి - రాజ్యమని పిలుస్తాం.

డా: స్వయంగా నాకు మిమ్మల్ని గురించి ఏమీ తెలియదు. కాని మీరు నలుగురూ కూడా మీ తాతగారికి మనఃక్లేశం కలిగించినట్టు నాకు తెలిసింది.

పురు: (తప్పు చేసినవాడల్లే) నేను చాలా సార్లు ఆయనదగ్గర డబ్బు తీసుకున్నాను. ఆయన కిష్టంలేకుండా యిచ్చాడని నాకు ఏనాడూ అనుమానం తగల్లేదు. నన్ను గురించి మరి ఆయనకెందుకు మనఃక్లేశం కలిగిందో -

ప్రసా: మా కుటుంబ వ్యవహారాలు మేము మీతో మాట్లాడి తీరాలాండీ డాక్టరుగారూ.

డా: (తాపీగా) అలాంటిదేమీ లేదు. ఆయన బతికిఉన్నంతకాలమూ నాకు ఆయన ఆరోగ్యంతోనే సంబంధం. ఆ తరవాత ఆయనకు ప్రతినిధిగా ఆయన విల్ అమలు చెయ్యటానికి హక్కు పొంది ఉన్నాను.

ప్రసా: అలా చెప్పరేం? నేను నా అనుమానాన్ని విత్ డ్రా చేసేసుకుంటా.

డా : (వెటకారంగా) ధన్యుణ్ణి. తాతగారి సొమ్ము మీ కందరికీ ఎంతెంత ముట్టిందో నాకు కొంచెం ఐడియా ఇవ్వగలరా? ఆశ్చర్యపడకండి. ఆయనను నేను కూడా తాతగారనే పిలుస్తూంటాను. ఈ రాఘవులు కూడా ఆయనకు ఒకరకమైన పెంపుడు మనవడే.

పురు : చాలా కాలంగా తాతయ్యను కనిపెట్టుకుని ఉన్నాడు. నే నెరుగుదును.

డా : మీలో ఏ ఒకరు అతనిలాగా తాతగారికి సేవచేసి ఉండరు. మీరు కలిగించిన విచారాన్ని ఈ రాఘవులు కొంతవరకు పోగొట్టాడని కూడా చెప్పగలను.

కమం : మీ మాటలకు అడ్డొచ్చినందుకు క్షమించండి డాక్టరుగారూ. ఇంతకు ముందుకూడా ఈ మాటే అన్నారు. మేం తాతయ్యకు కలిగించిన విచారమేమిటి?

డా : ఆ సంగతి నాకంటె మీకే బాగా తెలిసి ఉండాలి.

కమం : తెలిస్తే ఎందుకడుగుతా నండీ? నామీద తాతయ్యకు ఏనాడుగాని కొంచెం కూడా కోపం రాలేదని ఈనాటివరకూ అనుకుంటున్నాను. అది పొరపాటేనన్న మాట.

డా : అందులో పొరపాటేమీ లేక పోవచ్చు. ఎందుకంటే, ఆయనకు ఎవరిమీదా ఎన్నడూ కోపం రాగా నేను చూడలేదు. ఒక్కొక్కసారి ఆయన మనిషా, దేవుడా అని కూడా నేను ఆశ్చర్యపడతాను. ప్రపంచంలో వున్న పాపాన్నంతా క్షమించేటంత ఔదార్యం ఆయనలో ఉన్నట్టు నాకు తోస్తుంది.

ప్రసా : అటువంటివాళ్ళే పాపాన్ని పెంచేది.

డా : నేను చాలా అల్పప్రాణిని. తాతగారి ఔదర్యాన్ని విమర్శించే తాహతు నాకులేదు. మీరు స్వానుభవం మీద చెబుతున్నారేమో, నాకైతే తెలీదు. కాని ఇతరులలో పెరిగే పాపం ఆయనను చాలా బాధించింది. మీరు నలుగురూ పుణ్యాత్ములుగా బతికితే ఆయన మనస్సు చాలా సుఖపడేది.

రాజ్యం : ఇదంతా మిట్ట వేదాంతం. మనిషి అన్నతరువాత సాధ్యమైనంత సుఖపడాలని ఉంటుంది. సుఖం కోసం చేసే ప్రతిపనీ పాపమే అనవచ్చు. అది అర్థంలేని మాట.

డా : మీరంతా సుఖపడాలనే తాతగారి ఉద్దేశం కూడా. మీరు సుఖపడ్డందుకు ఆయన ఎప్పుడూ బాధపడలేదు. కాని, ఇతరులకు సుఖం కలిగించేశక్తి మీలో క్షీణించిపోతున్నకొద్దీ ఆయనకు మీ గురించి విచారం పెరిగి పోయింది. ఆయన ఉద్దేశంలో పాపమంటే ఇంకొకరిని సుఖపెట్టలేక పోవటమే. నాతో ఆయన ఈమాట అన్నారు.

ప్రసా : మా తాతయ్య సత్యకాలపు మనిషి గనక అలా అనుకున్నాడుగాని ఈ ప్రపంచంలో ఒకరినొకరు సుఖపెట్టరు, డాక్టరుగారూ, ఎవరి సుఖం వారు చూసుకుంటారు.

డా : ప్రపంచం సరిగా నడవవలసినట్టే నడుస్తున్నదని మీ అభిప్రాయమా,

ప్రసాద్ గారూ? అట్లాగే అనుకున్నా మీరు మీ తాతగారి మూలాన ఏమీ సుఖం పొందలేదా?

ప్రసా: నాకు తెలుసు, ఈ పుణ్యపాప విచారణ యావత్తూ రూపాయి అణా పైసల దగ్గిరికి వస్తుందని. నాకాయన డబ్బు ఇచ్చాడనేగా మీరనేది?

డా: అవును. మీరాయన దగ్గిర డబ్బు పుచ్చుకున్నది సుఖపడటానికే అనుకుంటున్నాను. కొంచెం ఆలోచించండి. పుణ్య పాపాలను డబ్బుతో ముడిపెట్టేది మీరనేమో. ఎందుకంటే మీ దృష్టిలో సుఖపడటం తప్ప మనిషికి ఉత్తమాదర్శం లేదు. సుఖాన్ని డబ్బుతో కొనవచ్చు. అందుచేత ప్రపంచంలో పుణ్యాత్ము లెవరంటే లక్షాధికారులూ కోటీశ్వరులూనూ.

ప్రసా: అందుకు సందేహమేమిటి? మా తాత చేసుకున్న పుణ్యం చాలావరకు డబ్బే.

డా: (నవ్వి) అయితే మైనస్లు పుణ్యం చేసుకునే అవకాశం లేదుగావాలు.

పురు: డాక్టరుగారూ, మనంచేస్తున్న ఈ సంభాషణ చాలా అప్రస్తుతమేమో, నాకు సెలవిచ్చినట్టయితే ఒక్కసారి మా తాతయ్యను కళ్ళచూసి నాదారిన నేను పోతాను.

డా: ఆయన్ను మీరిప్పుడు చూడడం సాధ్యంకాదు. మన మాటలు అప్రస్తుతంకావని రుజువు చేస్తాను. మీ వాళ్ళంతా ఉన్నారు కదా, వెళ్ళిపోవాలని మీకెందుకు తొందర?

పురు: వాళ్ళతో నాకేం పొంతన? వాళ్లు ఆహ్వానాలపై వచ్చినవాళ్ళు. నేను దారినపోతూ తొంగిచూసినవాణ్ణి.

డా: అలా అనుకోకండి. మీకూ ఆహ్వానం వెళ్లింది. మీ ఎడ్రస్ సరిగా మాకు తెలియలేదు.

పురు: దైవికంగానైనా వచ్చానుగదా. ఇక వెడతాను. వీళ్ళు దేనికోసం వేచి ఉన్నారో నాకు తెలియదు. నేను మటుకు గోతిదగిర నక్కను కాను. మా తాతయ్య నాకివ్వవలసిందేమో ఏనాడో ఇచ్చాడు. నేను నా కాళ్లపైన నిలబడగలిగాను. కుంటివాళ్ళనైతే చివరంటా మొయ్యాలి. నేను చాలాకాలంగా నా కాళ్ళపైనే నడుస్తున్నాను.

డా: అందుకు మిమ్మల్ని తప్పక అభినందిస్తాను. మీ తాతయ్యగారు కూడా అంతవరకు సంతోషించేవారేగాని, ఆయన మీనుంచి అంతకన్న ఎక్కువ ఆశించారనుకుంటాను.

పురు: ఏమిటది?

డా: ఇందాకటినుంచీ ఆ విషయం చెబుతూనే ఉన్నాను. మీరు నలుగురూ ఆయనకు కావలసిన వాళ్ళు. మీరే ఆయన భవిష్యత్తు. మీ మధ్య పరస్పరం ప్రేమలేకపోగా శత్రుత్వం పెరగటం ఆయనను చాలా బాధించింది. మీరు ఒకరి సుఖంకోసం ఒకరు పాటుపడితే ఆయనకు ఏ విచారమూ లేకుండాపోయేది. కాని అలా జరగలేదు.

ప్రసా: డాక్టరుగారు హాస్యధోరణిలో ఉన్నట్టున్నారు.

డా: చాలా సీరియస్‌గా చెబుతున్నాను.

ప్రసా: నేను నమ్మలేను.

డా: నమ్మలేకపోవటానికి కారణం ఉన్నది. మీరు నలుగురులో ఒకరి

కొందరు మీలో ఉన్న దుర్గుణాలనే ప్రదర్శిస్తూ వస్తున్నారు. సాధారణంగా చిన్న కిళ్ళీకొట్టువాడు కూడా తనకున్న సరుకులను సాధ్యమైనంత ఆకర్షవంతంగా చూపించటానికి ప్రయత్నిస్తాడు. మీలో మీరు మీ విష స్వభావాలనే ప్రదర్శించుకోవటానికి అలవాటు పడిపోయారు. ఇప్పుడు మీ మంచితనాన్ని బయట పెట్టుకుంటే అవతలివాళ్ళు అవహేళన చేస్తారన్న స్థితికి దిగజారారు.

ప్రసా : ఇదంతా మీరు ఊహించుకుంటున్నారు.

పురు : డాక్టరుగారూ, మీరన్నదానిలో కొంత నిజం లేకపోలేదు. ఒప్పుకుంటాను. కాని ఇది ఎవరి తప్పంటారు? నాతప్పే అయితే నేను ఈ క్షణం దిద్దుకుంటాను. కాని నాకు తెలుసు, తప్పు నాది కాదు.

డా : మీ ఉద్దేశంలో మొదటి తప్పెవరిది?

పురు : అట్లా అడిగితే చెప్పటం కష్టం. కప్పను పట్టటం పాము తప్పా, పాముకు చిక్కటం కప్ప తప్పా? ఎవరూ చెప్పలేరు.

డా : మీరు మీ విషయమే ఆలోచిస్తున్నారా? అందరి విషయమూ ఆలోచిస్తున్నారా?

పురు : ఇంకొకరి సంగతి నాకెందుకు? నా సంగతి చెప్పండి.

డా : మీరు మీ తోబుట్టువులకు మీలోని చెడు స్వభావాన్నే చూపిస్తున్నట్టు తెలుసుకున్న మరుక్షణం మారకపోవటం మీ తప్పు.

పురు : నాతో చెడ్డగా ఉండేవాళ్ళతో నేనెందుకు మంచిగా ఉండాలో నా కర్థం కాలేదు.

డా : పురుషోత్తంగారూ, మీ స్వభావానికి మీరే బాధ్యులన్నట్టుగా మాట్లాడుతున్నారు. కాని అది అపోహ కావచ్చునని మీకు తట్టలేదా?

పురు : నా స్వభావం నాదే. అందులో అపోహ ఏమీ లేదు. పైపెచ్చు మిగిలిన వాళ్ళ స్వభావం కూడా వాళ్ళదేనని గాఢ నమ్మకం.

డా : మీ స్వభావాలన్నిటినీ మీ తండ్రిగారు విడిచేశారని మీ తాతగారి నమ్మకం.

పురు : మా నాన్నను నేను బాగా ఎరుగుదును. ఆయన వాస్తవిక దృష్టి కలవారు. గాలిమేడలు కట్టి సంతోషించటం ఆయనకు సరిపడేది కాదు.

డా : ఒక్కొక్కసారి సంకుచిత దృష్టి కలవాళ్ళు వాస్తవిక దృష్టి కలవాళ్ళుగా చలామణీ అవుతారు.

పురు : మా నాన్న అలాటివాడని నే నమ్మను.

డా : మీపైన ఆయన ప్రభావం ఎలాటిది?

పురు : అది ఇంకొకరు చెప్పాలి.

డా : నేను చెప్పవచ్చా?

పురు : చెప్పండి.

డా : నాకు మంచిదిగా తోచలేదు. నాకు పగటి కలలు కనేవాళ్ళంటే విశ్వాసం ఉందనుకోండి. అలాటి పగటి కలలు ఎప్పటికైనా నిజం కావటం మూలానే ప్రపంచం ముందుకు నడుస్తున్నది. మీరు చెప్పే వాస్తవిక దృష్టిగలవాళ్ళు సాధించిన

ఘనవిజయం బతుకు తెరువు నేర్చుకోవటమే.

శకుం : ఎందుకొచ్చిన చర్చ పోనిస్తురూ.

డా : అమ్మా, మీరుకూడా ఓర్పుగా నా మాటలు వినండి. నేను చెప్పేది నా సొంత విషయంకాదు. ఇంతకు ముందు ప్రసాద్‌గారు డబ్బును మించిన పుణ్యం లేదన్నట్టుగా తేల్చారు. నన్నడిగితే మీరంతా మీ మీ స్వభావాలను బలవంతాన మార్చుకున్నారు. ఒకప్పుడు మీమధ్య ప్రేమబంధాలుండేవి. వాటిని ఎవరూ ప్రోత్సహించలేదేమో. లేక వాటిని ఎవరన్నా అవహేళన చేశారో, మొత్తానికి మీరు మీలో ఉండిన ప్రేమలను పూర్తిగా మరిచి పోయారు. మీ తాతయ్య మీ చిన్ననాటి విషయాలను ఎంతో శ్రద్ధగా జ్ఞాపకం ఉంచుకుని పెన్నిధిని దాచుకున్నట్లు గుండెలో దాచుకున్నారు. అందులో మీకేమీ నీతికనిపించలేదా?

ప్రసా : నేనంత పెద్ద అర్భాటమేమీ చేయలేదు.

ప్రసా : నాకు జ్ఞాపకం ఉన్నంతవరకూ వీళ్లెవరూ ఎన్నడూ నాపైన ప్రేమ చూపించలేదు. (నవ్వి) చూపించారనుకుంటేనే ఎబ్బెట్టుగా వున్నది. ప్రేమ. డామ్‌నాన్సెన్స్.

డా : ఒక్క చిన్న సంగతి జ్ఞాపకం చేస్తాను, ప్రసాద్‌గారూ. మీచెల్లెలు రాజ్యలక్ష్మికి ఎవరో ఒక బొమ్మ ఇచ్చారు. దానికోసం మీరు ఏడ్చి రాగాలు పెట్టి, ఆమెను కొట్టి తీసేసుకున్నారు. తరవాత మీ నాన్నగారింటికి వచ్చి మిమ్మల్ని గొడ్డును బాదినట్టు బాది ఆ బొమ్మ ఆమె కిప్పించేశారు. ఆ రాత్రి మీకు జర్వంవచ్చింది. ఒళ్లు తెలియని జ్వరం. ఈ రాజ్యలక్ష్మిగారు తన బొమ్మను తెచ్చి మీ పక్కలో పెట్టి, 'అన్నా, బొమ్మ తీసుకో. జ్వరం మానెయ్యి' అన్నారట. ఆ ముసలాయన దేవుడల్లే ఇది గమనించి తన గుండెలో దాచుకోకపోతే ఈనాడు నేనీ సంగతి మీకు జ్ఞాపకం చెయ్యలేను.

ప్రసా : చిన్నతనంలో అజ్ఞానం చేత అందరమూ అటువంటి పనులు చేస్తాం.

డా : క్షమించండి, ప్రసాదుగారూ. మీ చెల్లెలు ఆనాడు చేసినపని అజ్ఞానమైనదీ, మీ నాన్నగారు చేసినపని జ్ఞానమైనదీ అంటే నేను ఒక్కక్షణం కూడా ఆమోదించబోను. చిన్ననాడు సహజంగా మీలో ఉండిన మంచితనంచూసి ఇవాళ మీరు సిగ్గుపడితే పడండి. కాని సిగ్గుపడటమే ప్రగతి లక్షణమని మాత్రం చెప్పకండి. (కాస్సేపు ఎవరూ మాట్లాడరు) ఇంకా ఇటువంటివి చాలా చెప్పగలను. పురుషోత్తంగారూ, మీతమ్ముడు కాలవ ఒడ్డున కాలుజారి కాలవలో పడి కొట్టుకు పోతుంటే మీరుకూడా దూకిన సంగతి జ్ఞాపకం ఉన్నదా? ఎందుకు దూకారు? మీకు ఈత రాదు. ఆ సంగతి మీకూ తెలుసు. ఎవరో సమయానికి అటుగావచ్చి మిమ్మల్నిద్దర్నీ బయటికి ఈడ్వకపోతే ఆ రోజు మీ ఇద్దరూ అయిపోయి ఉందురు. ఇది జరిగి ముప్పై ఏళ్లుదాటి ఉండాలి. ఈలోపల మీరు చాలా జీవితం చూశారు. ఎంతో

జ్ఞానం సంపాదించారు. ఆ నాడు మీరు మీతమ్ముడి వెంట కాలవలో ఎందుకు దూకారో చెప్పండి.అందుకు మీరిప్పుడు సిగ్గుపడు తున్నారా? మిమ్మల్నిద్దరినీ రక్షించిన మనిషి కూడా నీటిలో కొట్టుకుపోతున్న మిమ్మల్ని చూసే రక్షించ వచ్చాడనీ, మీరు చెప్పినదాకా, మీ తమ్ముడి సంగతి ఆ మనిషికి తెలియదనీ విన్నాను. ఈ ప్రసాద్‌గారు ఆనాడే పోయి ఉంటే ఎక్కువ తృప్తిగా ఉండేదా?

పురు: (గట్టిగా నిట్టూర్చి) డాక్టరు గారూ, నేనీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేను. ఆసంగతి మీకూ తెలుసు. ఒక్క విషయం మాత్రం ఒప్పుకుంటాను. ఆరోజు నేను ఏ ప్రసాద్ కోసం కాలవలోకి దూకానో ఆ ప్రసాద్‌పైన నాకింకా చాలా ప్రేమ ఉన్నది. వాణ్ణి అప్పుడప్పుడూ జ్ఞాపకం చేసుకుంటాను. వాడు ఆనాడేపోతే నాకు తృప్తిగా ఉండేదా అని అడిగారే, వాడు ఆనాడు కాకపోయినా ఆ తరువాత ఎప్పుడో మారిపోయాడు. అందుకు నాకు విచారంగానే ఉంది. అంతకన్న నన్నేం చెప్పమన్నారు.

డా: మిగిలిన వాళ్ళ దృష్టిలో మీరు కూడా అలాగే మారిపోయారేమో?

పురు: కావచ్చు. మా శకుంతలను చదువు సంధ్యలు సరిగా లేని చవటకు కట్టబెడుతుంటే నాకు మండిపోయింది. నేనా రోజల్లా అన్నం తినలేదు. కనుక్కున్న వాళ్ళు లేరు. శకుంతలకు తప్ప నేనీ సంగతి ఇంకెవరికీ చెప్పలేదు.

శకుం: ఆ రాత్రి నేను నీకు లడ్డూలూ, చక్కిలాలు తెచ్చి యిచ్చా. ఇద్దరమూ జామచెట్టుకింద కూచుని తిన్నాం. మా ఆయన చచ్చిపోతే నాకు మళ్ళీ పెళ్ళి చేస్తారనీ, అప్పుడందరూ నిన్ను వెలివేస్తారనీ, నువు లక్షలకు సంపాదించి నాకు, నా రెండో మొగుడికీ మేడకట్టి పెడతాననీ అన్నావు, జ్ఞాపకం ఉందా?

పురు: (తనలో తాను నవ్వుకుంటూ) చిన్నతనపు బుద్ధులు. తలుచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఆ రోజుల్లో ప్రపంచం యింకోరకంగా ఉండేది. (ఏదో జ్ఞాపకం వచ్చినట్టుగా) నీకు జ్ఞాపకం ఉందా, శకుంతలా? శేషగిరిగాడు ఎప్పుడూ నన్ను అంటిపెట్టుకుని తిరిగేవాడు. వాడు పోయినప్పుడు నేను కుంగిపోయాను—

శకుం: శేషగిరి చచ్చిపోకపోతే పెద్దయినాక నువు వాణ్ణి పెళ్ళిచేసుకునే దానివేనా? అని నన్నడిగావు. నేను ధైర్యంగా ఓ అన్నా.

పురు: నువు మరచిపోలేదన్నమాట. అప్పుడు నాకెంత తృప్తి కలిగిందో నీకు తెలుసా?

శకుం: చిన్నతనంలో కొన్ని కొన్ని సంగతులు సులభంగా తెలుస్తాయి. నీకు సంతోషం కలుగుతుందని తెలిసే నేనా మాట అన్నది. (కొంచెం ఆలోచించి) చిన్నప్పుడు నేను ప్రతి దానికీ అబద్ధాలాడేదాన్నా ఏమిటి? నామాట ఎవరూ నమ్మేవాళ్ళు కాదన్నట్టు జ్ఞాపకం - ఏమబద్ధాలాడానో జ్ఞాపకంలేదు.

పురు : అం. అదేమీ లేదు. నాన్న మనలో ఒక్కొక్కళ్ళకీ ఒక్కొక్క గుణం ముద్ర వేసిపెట్టాడు. ఈ ముద్రలను చివరకు మనంకూడా నమ్మాం. నాకు లెక్కలు రావని ముద్రవేశాడు. పరీక్షలు వచ్చినప్పుడల్లా దగ్గర కూచుని నాచేత లెక్కలు చేయించేవాడు. ఆయన చేసే హంగామాతో నేను లెక్కల్లో సున్నాలు తెచ్చుకునేవాణ్ని. నేను థర్డ్ ఫారమూ, ఫోర్తుఫారమూ గుంటూరులోఉండి చదివాను చూడు, అప్పుడు లెక్కల్లో 70 కి తక్కువ రాలేదు.

శకుం : నాన్న అట్లా ఎందుకు చేసేవాడో.

పురు : జబ్బు, పిల్లలు తండ్రిని దేవుడల్లే చూడాలని చెబుతాడు చూడూ, దాన్ని ఆయన తిరగేశాడు. తండ్రులు పిల్లలకు దేవుడల్లే కనపడాలనుకున్నాడు. మనపట్ల దేవుడల్లే వ్యవహరించటానికి తనశక్తివంచన లేకుండా ప్రయత్నించాడు. నేను లెక్కలు రానివాణ్ణా, నువు అబద్ధాలాడేదానివి. ప్రసాదు మొండిపట్టు గలవాడు. ఆ వంకపెట్టి వాణ్ణి గొడ్డును కొట్టినట్లు కొట్టేవాడు. ఆయన ప్రసాదును కొట్టినప్పుడల్లా నేను దొడ్లోకి వెళ్లి బాదం చెట్టును కర్రతో కొడుతూ... చావు, చావు... అనేవాణ్ణి. (నవ్వి) ఒకసారి అమ్మ చూసింది. ఆవిడ నాన్నతో, వీడు మిమ్మల్ని చూసి చెయ్యెదురకు నేర్చుకుంటున్నాడు అన్నది. నాన్న చేసేపని నచ్చి నేనాయన్ను ఇమిటేట్ చేస్తున్నాననుకున్నది. ఆ బాదంచెట్టే నాకు నాన్న అనీ, నేను చావమంటున్నది నాన్న నేననీ అమ్మకు తెలియలేదు.

ప్రసా : చూడు పురుషోత్తం! నువ్వూ, నేనూ కలిసి,ఒకసారి నాన్న ఫౌంటెన్ పెన్ను అరిటిచెట్ల మురుగులో లోతుగా కూరేశాం. జ్ఞాపకం ఉందా?

పురు : కానీపెట్టి సోడా కొని ఇద్దరం తాగినందుకు ఇద్దర్నీ కొట్టాడు. సోడా తాగటానికీ - బీడీ తాగటానికీ తేడా లేదు ఆ దౌర్భాగ్యుడి ఉద్దేశంలో.

రాజ్యం : మిగిలినవాళ్ళ సంగతి నాకు తెలీదుగాని, ప్రసాదన్నయ్య నాన్న వినకుండా భయంకరమైన మాటలనేవాడు. ఒకరోజు నాకు చాకు చూపించి, ఇదుగోనే రాజీ! దీంతో సఫా అన్నాడు. ఏం సఫా చేస్తావు? అన్నాను. నా గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. ప్రసాద్ తల ఎగరేసి, వాణ్ణే అన్నాడు. మనిషికి రాక్షసి మొహం పడింది. రొప్పుతున్నాడు. నిజంగా నాన్నను చంపెయ్యబోతున్నాడనుకున్నాను. వద్దంటే నన్నే చంపుతాడేమోనని భయం; ఎవరితోనన్నా చెబితే, నాన్నకు తెలిసి ప్రసాదును చంపుతాడని భయం. కుమ్ములో పెట్టిన వంకాయల్లే అయిపోయాననుకో!

ప్రసా : నేనంత పెద్ద ఆర్భాటమేమీ చేయలేదు.

రాజ్యం : ఇంకా నయం. ఆ మధ్యాహ్నం గదిలో నాన్న పడుకుని నిద్రపోతుంటే పిల్లిలాగా లోపలికి పోవటం చూశాను. నాకేమీ తోచక ఇంటి

కప్పు ఎగిరిపోయేటట్టు, అమ్మా! నాన్న ఎక్కడే? అని గావుకేక పెట్టాను. అమ్మ నోరు నొక్కుకుంటూ, నాన్న నిద్రపోతున్నారు; అరవకే అన్నది. తరవాత నన్ను చూసి అమ్మ నవ్వింది. దీనికి ఉన్నట్టుండి వాళ్ళ నాన్నమీద చాలా అపేక్ష పుట్టుకొచ్చింది అని అందరితోనూ చెప్పింది. అందరూ నన్ను చూసి నవ్వారు. నాకు నామోషీ అయింది. కాని ఆ రోజు నాన్న చావకుండా కాపాడానని చాలా సంతోషించాను.

ప్రసా: నేను గదిలోకి వెళ్ళింది అందుక్కాదులే.

రాజ్యం: కాకపోవచ్చు. కాని నాకు తెలీదుగా. తరవాత నీ చాకుతీసి అటకమీద గిరవాటేసేశానులే. ఆ సంగతి నీకు తెలియక దానికోసం చాలా వెతుక్కున్నావు, పాపం

పురు: ఏమిటో, తలుచుకుంటే చిన్నతనంలో అనుభవించిన బాధలుకూడా బాగానే వుంటాయి. నాన్నా, తాతయ్యా భాగాలు పడినప్పటినుంచీ జీవితం ఇంకోరకంగా మారిపోయింది. అప్పటితో నా చిన్నతనం అయిపోయిందనుకుంటా.

శకుం: మనం తాతయ్యంటే ఇష్టంగా ఉండటం నాన్నకిష్టంలేదు. నువు గమనించావా ఎప్పుడన్నా?

పురు: గమనించకేం? నాన్న అసూయ పడేవాడు. పైకి పిల్లల ప్రేమతో పని లేనట్టు పోజు పెట్టేవాడు. లోపల తాతయ్యను చూసి కుళ్ళుకునేవాడు. కాని నాన్నకు నిజమైన షాక్ ఎక్కడంటే ఆయన రంగూను వ్యాపారం సాగించి రెండు చేతులా డబ్బు గడించటం మొదలుపెట్టాక. పులిని చూసి నక్కవాత పెట్టుకున్నట్లు తనుకూడా అడ్డదిడ్డంగా వ్యాపారం చేసి ఉన్నదంతా క్షౌరం చేసేసుకున్నాడు.

ప్రసా: తాను తినలేదు, మనల్ని తిననివ్వలేదు.

పురు: మనకేం లోటొచ్చిందీ? తాతయ్య సొత్తు తినేసామా, లేదా?

ప్రసా: డబ్బు ఖర్చుచెయ్యటం ఒక పెద్ద విద్యా ఏమిటి? నోట్లరూపంలో ఉంటే చెదలుకూడా తినేస్తాయి. మనకు సంపాదించే అవకాశాలు లేకుండా చేశాడే. నువు డాక్టరు చదువుకోసం కలలుకన్నావు; చదువు మానవలసివచ్చింది. నేను ఇంజనీరును అవుతానని ఎంతో ఆశపడ్డాను. శకుంతలకు వట్టి దిక్కుమాలిన సంబంధం చేశారు. రాజ్యం బ్రతుకు చెప్పనే అక్కర్లేదు.

పురు: ఏమైనా అవతల తాతయ్య డబ్బు లేకపోతే మనబతుకులు మరీ భ్రష్టుగా ఉండేవి.

ప్రసా: నా జీవితానికి అర్థంలేదనే విషయం పైకి తెలియకుండా ఉండటానికి తాతయ్య డబ్బు బాగా వినియోగించింది. వేలకు వేలు ఖర్చు చేసి లోకాన్ని ఉద్ధరించాను. ముఖ్యంగా ఆడవాళ్లను ఉద్ధరించాను. ఇది ఎంతోకాలం సాగదని నాకు తెలుసు. తాతయ్యకు జబ్బుగా ఉందని టెలిగ్రాం రాగానే అలారం మోగినట్టయింది.

పురు: ఏదో సినిమా తీసే ప్రయత్నంలో ఉన్నానన్నావ్?

ప్రసా: అది నిజమే. కాని చేతిలో డబ్బులేదు. తాతయ్య ఎలాగూ బతకడు. ఆయనకు మిగిలిన దంతా ఒక మొత్తంగా పుచ్చుకుని సినిమా తీద్దామనుకున్నాను. మిమ్మల్నందర్నీ చూడగానే నాగుండె జారిపోయింది. టెలిగ్రాములు అందరికీ వెళ్ళాయని నాకేం తెలుసూ?

పురు: నేను టెలిగ్రాం చూసి రాలేదు ప్రసాద్. నాకు తాతయ్య సొమ్మేమీ అవసరంలేదు. ఆదివరకు ఆయనదగ్గర చాలా డబ్బు పుచ్చుకున్నాను. ఒక ఫాండ్రీ, కార్ఖానా, నడుపుకుంటున్నాను. నేనెలాగో బతుకుతాను. నా వంతుకూడా నువే తీసుకో.

కమలం: నా సంగతేమిటన్నయ్యా? నేనూ పిల్లలూ చాలా క్షోభపడిపోతున్నాం. నన్ను మా ఆయన ఎంత మోసం చేశాడో మీకు తెలుసుగా? తాతయ్య నాకు ఎంత డబ్బు పంపించారో చెప్పలేను. అంతా నా మొగుడే తాగేశాడు. ముందు నన్ను నగలు చేయించుకోమని కాల్చుకు తినటమూ, తరవాత వాటిని అమ్మేసి తాగటమూనూ. ఆయన పోయాక తాతయ్య నెలనెలా పంపిస్తున్న రెండు వందలతోనూ కాలక్షేపం చేస్తున్నాం. ఓర్వలేక కంట్లో నిప్పులు పోసుకుంటూనేగాని, రాజ్యం బతుకే సుఖంగావున్నది. దానికి అండాదండా ఉన్నారు. తిండికీ బట్టకూలోటు లేదు. నలుగురి నోళ్ళలోనూ నానితే ఏం గాక, సుఖంగా బతుకుతున్నది.

రాజ్యం: నువే సుఖంగా వున్నావని నేననుకుంటున్నాను. నేనే సుఖంగా వున్నానని నువ్వనుకుంటున్నావు. ఇస్త్రీ వాయినం, పుచ్చుకుంటి వాయినం, సరిపోయింది.

ప్రసా: అదేమిటి? నువు నాయుడితో ఉండటంలేదా?

రాజ్యం: (కళ్ళనీళ్ళ పర్యంతమై) ముప్పై నిండకుండానే నా బతుకు ముక్కలు చించిన విస్తరి అయింది. నాకన్న నాలుగేళ్ళు చిన్నదానితో పోటీ చెయ్యలేక నేను వీధిలోవచ్చిపడ్డాను. నాకూడా తాతయ్యే నెల నెలా డబ్బు పంపిస్తున్నాడు. అందులో కొంత దాచి వెనకేసుకుందామని ఒకప్పుడనుకున్నాను. కాని రేపు గురించి ఆలోచించటం చాలా బుద్ధితక్కువగా తోచింది. నాయుడు నన్ను విడిచి క్షణం ఉండలేడని ఎంతో గర్వపడ్డాను. చివరి రోజుల్లో ఆయన నన్ను వదిలించుకోవటానికి నానాపాట్లూ పడుతుంటే నాకివి అర్థంకూడా కాలేదు. మగవాడి కేమన్నా భవిష్యత్తున్నదేమోగాని ఆడదానికి అటువంటిది లేదు. అందుకేనేమో మా ఆడవాళ్ళు ఉన్న జీవితం ఉన్నట్టుగా వెళ్ళిపోతే చాలునని దేవుళ్ళకు దణ్ణాలు పెట్టుకుంటారు. నాకు అటువంటి వాళ్లను చూస్తే చాలా వెటకారంగా ఉండేది. కమలంతలక్కయ్యకు బతకటం చాతకాదనుకునేదాన్ని.

కమలం: (నిట్టూర్చి) అందులో అబద్ధం ఏమీలేదులేవే, తల్లి.

పురు: రాజ్యం, నువ్వు ఏనాడు నాదగ్గర వచ్చి ఉంటానన్నా నాకేమీ అభ్యంతరం లేదు. పాపం, శకుంతల పిల్లలు గలది. దానికి నువ్వేమీ సహాయం చెయ్యలేవా?

ప్రసా: నన్ను ఈ పిక్చరు తియ్యనివ్వండి. అందరం హాయిగా బతుకుదాం. రాజ్యం! నా పిక్చర్లో వేషం వేస్తావా?

రాజ్యం: నేనా?

ప్రసా: అవును. ఏం? డబ్బు ఖర్చు చెయ్యటమే తెలిసి ఏం లాభం, రాజ్యం. సంపాదించటంకూడా నేర్చుకుందాం. ఆ నాయుడు బాబుల్లాంటి వాళ్లని చుట్టూ కుక్కల్లాగా కారం డేట్టు చేస్తాను. ఎల్లాగో సినిమా తీయటంలో అంతులేని డబ్బు మంచినీరులాగా ఖర్చయిపోతుంది. నన్నడిగితే శకుంతలక్కయ్యకూడా వేషం వెయ్యొచ్చు. తప్పేమిటంటాను.

రాజ్యం: అవును ప్రసాద్. నువు చెప్పింది బాగానే ఉంది. తాతయ్య డబ్బులో నా వాటాకూడా నువే తీసుకుని పిక్చరు తియ్యి. పెద్దన్నయ్య ఎల్లాగో ఇస్తానన్నాడాయె.

శకు: ఇన్నాళ్ళూ ఒకరికొకరం కాకుండా బతికాం. ఈ రూపంలోనైనా మనం బతుకులు కలబోసుకుందాం. నావంతు కూడా ప్రసాదుకిస్తాను.

ప్రసా: ఉండండి ఉండండి. మీరంతా ఎగిరే ఎద్దుకు గంత తగిలించేస్తున్నారు. పిక్చరు తీద్దామనుకున్నప్పుడు నాకు కొంచెంకూడా బరువూ, బాధ్యతా తోచలేదు. అందులోకి మీరంతా వస్తామంటూంటే నాకు అదురు పుట్టుకొస్తున్నది. ఒకవేళ నేను దెబ్బతింటే మీరంతాకూడా నష్టపడతారే. ఇదివరకల్లా నట్టేట నావ మునగటమూ, నేను ఏదో విధంగా ఒడ్డుకు ఈదుకొస్తూ ఉంటటమూ జరిగింది. ఈసారి మీరంతా ఉంటే నేను నావ నడపటం క్షేమమా?

పురు: బాధ్యతతో పనులు చెయ్యటం ఎప్పటికోప్పటికి నేర్చుకోవద్దుట్రా?

ప్రసా: బతికున్నన్నాళ్ళూ బాధ్యత నుంచి తప్పించుకోవటమే ఆదర్శంగా పెట్టుకుని ఉన్నవాణ్ణి మరి.

డా: మీ కుటుంబం చర్చలో జోక్యం కలిగించుకుంటున్నాను, మన్నించాలి.

పురు: (నవ్వుతూ) చెప్పండి, డాక్టరు గారూ. మీ ఆధ్వర్యం కిందనే ఈ ఈ చర్చ అంతా జరుగుతున్నది నిజానికి. అయితే ఇంతసేపూ మేము మిమ్మల్ని మరిచిపోయాం.

డా: తాతయ్యగారి దగ్గర డబ్బు దాదాపూ ఏమీ లేదు. ఆయన ఆ సంగతి నాతో చెప్పారు.

పురు: నిజమేనా, డాక్టరుగారూ?

డా: నేను హాస్యానికి అనటంలేదు.

పురు: పాపం, ప్రసాద్ ప్లానులన్నీ పాడేనన్నమాట.

ప్రసా: నావి కేవలం ప్లానులే. నిజం చెప్పాలంటే, నేనీ పిక్చరుతీసి బయటపడేస్తాననీ, దానికి డబ్బొస్తుందనీ నా అంతరాత్మలో ఏమూలా నమ్మకం లేదు. తాడూ కోలా లేకుండా పిక్చర్లు తీయటానికి పూనుకునేవాళ్ళను చూస్తున్నాగా.

రాజ్యం: అదేంమాట? తాడూ కోలా లేకుండా సినిమాలలో డబ్బు చేసుకునేవాళ్ళూ ఉన్నారు. నన్నడిగితే

పెట్టుబడి లేకుండానే సినిమాలు తీస్తున్న వాళ్ళు కూడ ఉన్నారు. (ప్రసాద్ నవ్వుతాడు) ఏం, నవ్వుతున్నావ్ ?

ప్రసా : నా మొదటి ఆలోచన అదే! పెట్టుబడి లేని వ్యాపారమే చేద్దామనుకున్నాను. అన్నయ్య బాధ్యత అంటున్నాడే, ఇది జరిగే పని కాదు. నేనింకేదైనా చూసుకుంటాను. నాకు ఫరవాలేదు. మగవాణ్ణి, కాని, పాపం, మీ ఆడవాళ్ళిద్దరూ ఏమయ్యేట్టు ?

శకుం : నిండా మునిగిన దానికి చలేమిటి? వంటలుచేసుకు బతుకుతాను. రాజ్యం సంగతే ఘోరం.

రాజ్యం : (చిరాకుగా) నన్ను గురించి ఎవరూ దిగులు పడక్కర్లేదు. బతుకు తెరువులన్నీ నాకు బాగా తెలుసు. ఏట్లో పారేస్తే ఎదురీదేస్తాను. జీవిత సముద్రంలో ఒంటరిగా తెప్ప నడుపుతున్నందుకు ఇన్నాళ్లూ గర్వపడ్డాను కూడా. అయితే, ఈ కాస్సేపటిలో ఒక కల వచ్చినట్లయింది. తెప్ప ఒడ్డుకొచ్చిందనిపించింది. ఆయిన వాళ్ళ మధ్య ఆప్యాయంగా బతకవచ్చుననుకున్నాను. కాని, అది కలే! మళ్ళీ నా వాస్తవ జీవితం నాకుండనే ఉన్నది.

పురు : ఆ కల ఏదో రూపంలో నిజం చేసుకుందాం, రాజ్యం. నేను చాలా కాలంగా పేదజీవితం గడపటం నేర్చుకున్నాను. ఇన్నేళ్ళూ మీ రెవరూ నన్ను చూడరాలేదు. అందుచేత మీకు తెలీదు. నా కార్ఖానాలో పని చేసేవాళ్ళు బతుకుతున్నట్టే నేనూ బతుకుతున్నాను. రాజ్యం! నీ విలాసాలూ, డ్రెస్సులూ ఖులాసా తిరుగుళ్ళూ మానేసి, నా దగ్గర వచ్చి ఉండు. మనం సుఖాలు పంచుకోనే లేదు; కష్టాలన్నా పంచుకుందాం.

రాజ్యం : (ఆవేశంతో) నీ సుఖాలూ వద్దు, కష్టాలూ వద్దు. నేను నీ ఇంటికెందుకు రావాలి? నువ్వెవరో, నేనెవరో. (ఏడుస్తుంది)

పురు : ఊరుకో రాజ్యం, చిట్టి తల్లివి కాదూ. (రాజ్యం ఇంకా ఏడుస్తుంది) చిన్నప్పుడు ఎంత ఏడుపులో కూడా నేను నవ్విస్తే నవ్వేది.

రాజ్యం : (ఎగబీలుస్తూ) నేను సుఖంగా బతుకుతున్నానని మీరలా అనుకుంటున్నారన్న మాట. నా జన్మకి సుఖంలేదు. రైలుకింద పడదామని ఆదివరకు రెండుసార్లు ప్రయత్నించాను. పడితే పీడ విరగడై పోయి ఉండేది.

పురు : రాజ్యం, నువిక ఒంటరిగా బతకటానికి వీల్లేదు. నా వెంట వచ్చేస్తున్నావు.

రాజ్యం : నేను రాను;

పురు : రాకపోతే తన్ని లాక్కుపోతాను, అంతే.

రాజ్యం : అక్కయ్యను తీసుకుపో.

పురు : అదీ వస్తుంది (కలలుకంటూ) మా ఇల్లు ముచ్చటగా ఉంటుంది. ఇంట్లో పచ్చగా ముగ్గురాడవాళ్ళు. సందడిగా పిల్లలు...నీ సంగతేమిటిరా ప్రసాద్. నువుకూడా మా కొంపలో ఇమడలేవూ ?

ప్రసా : నేనా పిక్చరు తీస్తాను. అందులో నాలుగు డబ్బులు ఏదో విధంగా వెనక వేసుకున్నాక పై సంగతి చూస్తాం.

అన్నె : (అవతలగదిలోంచి) శ్రీమన్నారాయణమూర్తి...నాయనా...

రాజ్యం : (ఉలిక్కిపడి) ఏమిటదీ?

పురు : ఆ మాట్లాడింది తాతయ్యేనా డాక్టరుగారూ ?

రాఘు : నేను వెళ్లి చూసివస్తా (వెళతాడు)

డా : రాఘవులుకు తాతగారీ యిల్లు ఇచ్చేశాడు. అతనిపేర యీ పది పదిహేనేళ్లనుంచీ బాంకులో డబ్బు కూడా వేస్తూ వస్తున్నారు. ఈపాటికది పెద్ద మొత్తమై వుండాలి.

పురు : అంత డబ్బుండికూడా యితను తాతయ్యకు సేవ చేస్తున్నాడా?

డా : దానిలో ఆశ్చర్య మేముందీ?

పురు : మాకు బతకటం చాతకాకపోవటమే ఆశ్చర్యమనుకోండి.

డా : యుద్ధంవచ్చి తాతగారి వ్యాపారం పాడుచెయ్యకపోతే మీ కెవరికీ ఏ లోటూ వుండేదికాదు.

రాఘు : (ఆదుర్దాగా వస్తూ) డాక్టరుగారూ! ఒక్కసారి తాతగారిని చూడండి.

డా : వస్తున్నా! (మిగిలిన వాళ్ళతో) మీరిక్కడే ఉండండి.

రాజ్యం : ఎందుకీ డాక్టరుగారు మనని తాతయ్యకు ఎడంగా ఉంచుతున్నారూ?

పురు : నాకేమీ అర్థం కావటంలేదు. ఆయనకు వేరే జబ్బేమీ లేదుట. ఏ జబ్బూ లేకపోతే మత్తు మందెందుకిచ్చారూ ?

ప్రసా : అర్థంలేని మాట. మత్తుమందిచ్చినంత మాత్రాన మనం తాతయ్యను చూడరాదనటం దేనికీ? ఈ డాక్టరుగారు ఏదో నాటకమాడుతున్నట్టు నాకు అనుమానంగా వుంది.

శరం : ఇంతకుముందు మనం విన్నది తాతయ్య గొంతేనా? అదేదో మాదిరిగా వినపడిందే. అదుగో డాక్టరుగారు.

రాజ్యం : ఆయన మొహం అలా అయిపోయిందేమిటి?

డా : (వణుకుతున్న గొంతుతో) ఏం పని చేశాను. ఏం పని_

పురు : ఏం జరిగిందో చెప్పండి డాక్టరుగారూ. ముందు కూచోండి.

రాఘు : (విచారంతో) ఇంకేం కావాలి, బాబూ. తాతగారు దాటిపోయారు.

పురు : (నిట్టూర్పుతూ) హుః, అనుకున్నదేగా. పెద్దవాడూ, అందులోనూ జబ్బుగా ఉన్నట్టున్నాడూ.

డా : నన్ను మన్నించాలి, పురుషోత్తంగారూ. మీరు వచ్చేసరికి తాతగారికి ఏ జబ్బూ లేదు. ఆయన సలహాపైనే నేను మీతో అబద్ధం ఆడాను. మీరిక్కడ కూచుని మాట్లాడుకోవటం మొదలుపెడితే, మీలో ఉండే మంచితనాన్ని మీరే గుర్తించుతారని తాతగారి ఉద్దేశం.

పురు : అంటే ? నాకర్థం కాలేదు.

డా : ఆయన హృదయం నాకే ఒకంతట అర్థం కాలేదు. మొత్తంమీద ఆయనకు ఉద్దేశమేమిటంటే మీరంతా మీలో ఉన్న మంచితనాన్ని మరిచిపోయి, సుఖంలేని జీవితాలు జీవిస్తున్నారని డబ్బుతో మీకు సుఖంరాదని ఆయన ఏనాడో తెలిసిపోయింది.

ప్రసా : డాక్టరుగారూ, తాతయ్య బతికే ఆశలేదా? ఏదన్నా ఇంజెక్షనిస్తే—

డా: అదీ అయింది. ఆయన చావు నాకు చాలా వింతగా వున్నది. ఆయన ఆనందంతో ప్రాణం విడిచాడా అని నా అనుమానం.

శకుం: మేం ఒకళ్ళతో ఒకళ్ళం గర్భ శత్రువుల్లాగా మాట్లాడుకుంటూంటే విని తాతయ్య గుండెపగిలి ఉంటుంది.

ప్రసా: అవును, తాతయ్యను మనమే చంపాం.

డా: అటువంటి అపోహ మీకు వద్దనే వద్దు. ఇంత కాలానికి మీరు తాతగారికి ఆనందం కలిగే మాటలు మాట్లాడారు.

రాజ్యం: (కన్నీళ్ళతో) బతికినన్నాళ్లూ లేకపోయినా, చచ్చేముందైనా మా వల్ల తాతయ్యకు ఆనందం కలిగిందా, డాక్టరుగారూ?

డా: మీరు మళ్ళీ పాత ధోరణిలో పడకండి. ఆయన ఆత్మకు శాంతి ఉండాలంటే మీరు ఒకరిపైని ఒకరు ప్రేమగా ఉండండి. ఆయనకు మీపైన ఎంతప్రేమో మీలో ఒక్కరికి తెలీదు.

పురు: నేను కొంచెముగా ఊహించగలుగుతున్నాను, డాక్టరుగారూ... మా మంచితనంలో మాకు లేని విశ్వాసం తాతయ్యకున్నదంటే–

డా: రాఘవులూ, మనం తాతగారి అంత్యక్రియలను గురించి చూద్దామా ... పురుషోత్తంగారూ, మీరంతాలోపలికి వెళ్ళి తాతగారిని ఆఖరిసారిచూడండి.

[అందరూ కలిసి గదిలోకి వెళ్లే విరామం. అందరూ తాతగారి శవం చుట్టూ చేరి చిన్న గొంతులతో మాట్లాడుతారు]

శకుం: తాతయ్య తీరే మారలేదు. నేను కిందటిసారి చూసినట్టే వున్నారు.

రాజ్యం: మొహం నవ్వుతున్నట్టుగా వుంది కాదూ!

పురు: ప్రసాద్, మనం తాతయ్య ఆఖరు కోరిక దక్కించగలమా?

ప్రసా: డాక్టరుగా రన్నమాటలు నాకర్థం కాలేదనుకున్నావా, అన్నయ్యా?

రాఘు: (ఎడంనుంచి) పెద్దబ్బాయిగారూ!

పురు: ఇక్కడే వున్నావా, రాఘవులూ?

రాఘు: లేదు, వెళుతున్నా. మీతో ఒక్కమాట చెప్పిపోదామని వచ్చా- బయట డాక్టరుగారు కాచుకున్నారు.

పురు: చెప్పు రాఘవులూ!

రాఘు: మీరంతా ఏదన్నా కలిసి చెయ్యదలిస్తే నన్ను మరిచిపోకండి. నా దగ్గర పదిహేనువేల దాకా డబ్బున్నది... వస్తా. (వెళతాడు)

పురు: (ఆశ్చర్యంతో) ఏం మనిషి!

ప్రసా: తాతయ్యకు ప్రతినిధిలా గున్నాడే.

పురు: ప్రసాద్, ఇవాళనుంచీ మనం అయిదుగురం. తాతయ్యా, ఇకనుంచీ మేం అయిదుగురం.

★